# సీత పండుగ

(కథానిక)

పెరటి గుమ్మంలో కూర్చొని సీత జడ వేసుకుంటోంది. గోడకు చేరబెట్టిన అద్దాన్ని చప్పున లాగివేశాడు రెండేళ్ళ రఘు.

"అబ్బబ్బ! తినేస్తున్నావురా మరీను. ఎక్కడా చూడలేదు బాబూ యింత చేటు అల్లరి."

జారిపోయిన అద్దాన్ని సరిచేసింది. అద్దంలో చూసుకొని పాపిట తీసికుంటున్నాదనే సరికి మళ్ళా లాగివేశాడు.

సీత ఒక్క విసురున ఒళ్లో కూలవేసి రెండు కాళ్ళతోనూ బంధించింది.

రఘు ఏడవలేదు. ఫక్కున నవ్వాడు.

తన కోపానికి కొంచమైనా విలువ లేక పోయిందిగదా అని భగ్గుమన్నది.

"వెధవా! వుండు. తాతయ్యతో చెప్పి నీ పని పట్టిస్తాను. రోజురోజుకూ పెంకితనం హెచ్చయిపోతోంది" అని మళ్ళా జడవేసుకోవడంలో నిమగ్నురాలయిపోయింది.

రఘు నవ్వలేదు. అలాగని ఏడవనూ లేదు. ఒకమారు అద్దంలోకి, ఒకమారు తల్లి ముఖంలోకి చూస్తున్నాడు. తల్లి తనవేపు తీక్షణంగా చూడగానే ఎక్కడలేని దుఃఖమూ ముంచుకొచ్చింది. కళ్ళంట నీళ్లు గిర్రున తిరిగాయి.

"నా చిట్టి తండ్రివికదూ ఛీ. నిన్ను కాదు, హూష్ కాకీ ముంచిదానివే. మా చిట్టిబాబును యేడిపిస్తున్నావా? ఉండు నీ పని పట్టిస్తాను. రేపటినుంచి నీకు తాయం యిస్తానేమో చూసుకో."

"ఏంరా బాబూ! అంతేనా. అది వెధవ కాకి. నువ్వు నా బంగారు తండ్రివి కదూ."

రెండు చేతుల్లోకి రఘుని తీసుకొని ముద్దాడింది. ఒక ప్రక్కనుండి కళ్ళంట నీళ్లు రాలుతూ వుండగానే ఫక్కున నవ్వాడు.

పమిట కొంగుతో కన్నీటిని తుడిచింది.

"ఏవండోయ్! అమ్మగోరూ! చిట్టి బాబు తాతగోరింటి కెళ్తున్నట్టున్నారు. పండుగ బత్తెం యిప్పించి మరీ యెళ్లమనండి."

నూతిదగ్గర అంట్లు తోముతున్న వెంకి మాటలు వినిపించగానే యిద్దరూ అటు చూశారు.

"ఓస్! ఆమాత్రం నీకు పండుగ డబ్బులివ్వలేదంటే నా చిన్న జమీందారు. తలుచుకుంటే తలకొక వరహా యిస్తాడు. ఏంరా బాబూ! అంతేనా?"

"వరహాలూ, మాణిక్కాలూ మాకెందుకమ్మా. ఉప్పు గల్లు కొనుక్కోడానికి పావలా డబ్బిప్పిస్తే అదే పది వేలు."

"ఇంతేనంటే! కోరికోరి మా గొప్ప కోరిక కోరావు. గుమ్మంలో కాలు పెట్టగానే ముందు యినప్పెట్టె తాళాలు పుచ్చుకుంటాడు తాతయ్య దగ్గరనుంచి ఏమనుకుంటున్నావో ఏమో?"

"ఎంత అభిమానమమ్మా తాతయ్యకి. పుట్టిన కాడనుండి ఒక్కనాడైనా చూట్టానికి రావడం మానేశాడుగాని."

అని వెంకి, సీత చూడకుండా మూతి విరించింది.

"మా బాబుమాత్రం తక్కువవాడనుకున్నావేంటి. తాతయ్య రెండు చెవులూ పట్టుకొని ఆడిస్తాడు."

అంటూ సీత చిక్కు తీసుకొంటోంది. అంట్లు తోమడం కట్టిపెట్టి దగ్గరగావచ్చి కూర్చున్నది వెంకి.

"మీరేవంటే అనండి అమ్మగోరూ! నాకేం నచ్చలేదు సుమండీ. లేక లేక పుట్టాడు పండంటి బాబు అసైనా చూడ్డానికి రాకపోతే దేనికండీ. ముద్దయినా, ముచ్చటయినా ఇప్పుడేగాని తరువాత ఏముంటుందండి." అన్నది వెంకి పసివాడిమీది ప్రేమతోనూ, తాతయ్యగారిమీది అసహ్యంతోనూ.

"అది కాదే, అన్నీ తెలుసుండీ ఆయన్ని మాత్రం అని లాభమేమిటి చెప్పు. నీకు తెలియదు కాని, మా నాన్నకు ఉదయం లేచిన దగ్గరనుంచి మళ్ళా మంచాన పడేవరకూ ఒకటే వ్యాపకాలు. అసలు యింటి సంగతి చూడడానికే తీరికవుండదు."

తండ్రిని సమర్థించే ధోరణిలో సీత ప్రారంభించింది. వెంకి ఏమాత్రమూ దీనికి సమాధాన పడ్డట్టు లేదు

"ఏటమ్మా! అలా చెబుతారు. ఇక ప్రపంచంలో మనుషులే లేరంటారు యేపకాలూ చేసుకోలేదంటారు. అంత అభిమానమున్న బాబైతే వచ్చి చూసిపోడానికే తీరిక లేదటమ్మా, మీరు చెప్తారు మరీను?"

"అబ్బబ్బ! నీకింత పిసరూ తలకెక్కదే వెంకీ! నీమాటే నీదికాని యింకోటి వినవు కదా. మొన్న మాతమ్ముడొచ్చినపుడు ఏం చెప్పాడో తెలుసా. "నాన్నకింత పిసరూ తీరిక లేదు. పనులమీద ఏవూరు వెడుతున్నారో కూడా యింట్లో చెప్పడంలేదు. నెల లో నాల్గు రోజులు యింటి పట్టున వుండడం కష్టమయిపోతోంది" అన్నాడే. అలాంటప్పుడు ఇంకే మనమంటావో చెప్పు?"

వెంకి మాటాడలేదు. పక్కగా పడివున్న చీపురు కట్టలోని పుల్లతీసి పళ్లు కుట్టుకుంటోంది.

"ఇంతకీ అభిమానం లేకపోడానికి యేం లోటు చేశారని. నగలు పెట్టలేదా? ముద్దూ ముచ్చటా తీర్చలేదా? ఇప్పుడొక మాట రాలేదని అన్ని మాట లనేయడమేనా? ఆ మాటకొస్తే, నాకు పెట్టిన నగలూ, చీరలూ, మా చెల్లెళ్ళ కెవరికీ పెట్టనేలేరు."

"అదేమోనమ్మా! నాకేం తెలుసు మీ యింటి సంగతి. చూస్తున్న ఓళ్ళంగనక సమయమొచ్చినపుడు మాటనుకుంటాం" అన్నది వెంకి చీపురు పుల్లను విరిచి విసరివేస్తూ. సీత మాత్రం వూరుకోలేదు.

"మూడు. ఈ నాలుగుపేట్ల వంకీ గొలుసు మా వాళ్ళు పెట్టిందేనా మరి. ఈ నాలుగు బ్రిడ్జీ గాజులూ ఎవరు పెట్టారనుకున్నావు. మొన్న పోయిన పొళ్ళవుంగరం మా అమ్మ స్వయంగా నా వేలికి పెట్టింది. ఒక్క ఒడ్డాణం, రెండు జతల గాజులూ పెట్టేసరికి మూడు చెరువుల నీళ్లు త్రాగారు మీ బాబుగారు"

"నిజమేనమ్మా! నిజమే. కాదన్నా నా."

"ఇంకా విను. ఇవిగాక మీ బాబుగారు పండుక్కి దయచేసినప్పుడల్లా కొత్త కొత్తకు తక్కువలేని వుంగరం పెడుతూ వుండేవారు. సమయమొచ్చినపుడు మాటలనేస్తాం యివన్నీ మరిచిపోయి."

చెవులప్పగించి వింటోంది వెంకి.

"మా నాన్నకి ఒక్క విచారం కాదే. పాపం. అందరూ ఆయన్ని అన్నవాళ్ళేను మా తమ్ముళ్లు పట్నంలో చదువులు పేరుచెప్పి వేలకు వేలు తగలేస్తున్నారు. మా చెల్లెళ్ళ సంసారాలు ఎప్పుడూ మావాళ్ళింట్లోనే. చుట్టపు చూపు కెడతారు అత్తారింటికి మా అమ్మ వొటి వెత్తి బాగులిది. ఎవరైనా వొచ్చి అమ్మా! యీ పూటకి బియ్యం లేవు! అంటే చాలే, కుంచెడు బియ్యం తెచ్చి వాళ్ళవొళ్లో పోస్తుంది"

అని చెబుతూవుండగానే సీత కళ్ళలో నీళ్లు వూరేయి. వెంకి మనస్సులో సందేహాలు వూరేయి.

"నేనెరక్కడుగుతానండమ్మా. మరి మొన్న తమ్ముడు బాబుగారొచ్చినారుగందా, అప్పుడేనా ఏమైనా పంపకపోయారా చెప్పండి?"

"వాళ్ళకంత తెలివుంటే ఇంకేం చెప్పు. లోకులకు వెఱచైనా పంపవలసింది"

పుట్టింటి గురించి తలంపు రాగానే సీతలో వున్న వుత్సాహమంతా సన్నగిలిపోయింది. ముఖకవళికలు పూర్తిగా మారిపోయాయి. దిగులుగా కూర్చున్నది ఒళ్ళోని పిల్లడు అలాగనే నిద్రపోయాడు.

అంతవరకూ ఎంతో ఓపికతో కూర్చున్న వెంకి చప్పున నిలుచుంది. బద్ధకంగా వొళ్లు విరుచుకుంది. సీత యింకా ఆలోచనలోనే ఉన్నది.

"సీతమ్మగారూ! మాపిటికి వంచుకోటానికేం లేదమ్మా. కొద్దిగా వూరగాయ పెడుదురూ."

వెంకి మాట వినగానే సీత మళ్ళా యీ పపంచంలోకి వచ్చింది.

"అప్పుడే పోతావుటే. ఇంకా దీపాలేనా పెట్టలేదు కూర్చో ఇస్తాను"

కాదనలేక మళ్ళా చతికిలబడ్డది.

"అయితే వెంకీ! మీ అమ్మ ఎప్పుడూ నిన్ను పుట్టింటికి తీసికెళ్ళినట్టు లేదే?"

ఈ ప్రశ్న వెంకికి నవ్వు తెప్పించింది నవ్వు ఆపుకుంటూనే,

"మాబాగా అడిగేరమ్మా అడగ్గా, అడగ్గా, ఏనాడో అన్నీ వొదులుకున్న నాకు పుట్టిల్లేటమ్మా" అన్నది.

నవ్వయితే నవ్వేసింది గాని దాని వెనకాల దాగివున్న బాధను ఎక్కడ దాచగలదు?

"అదేమిటే వెంకీ! అలా నవ్వుతావు. వెఱ్ఱి నవ్వు నవ్వావు."

"నవ్వురాదటమ్మా మరి. నాకు పుట్టిల్లేటి చెప్పండి. అందరినీ వొదులుకునే కదా ఈడిని లేవదీసుకొచ్చింది."

"అది కాదే. పండగనాడైనా వెళ్ళలేదా అని"

తన సంగతి వేరుగ వుంచి పైవాళ్ళ సంగతి తెలుసుకుందామన్న కోరిక ప్రబలంగావుంది. అందుచేత వెంకి తన సంగతి చెప్పడానికి ఎంత యిష్టం లేకపోయినా సీత వూరుకోలేదు.

"ఎవరేనా పుట్టింటి కెళ్ళారంటే నాలుగు పట్టుకొస్తారు. నేను పుట్టింటి కెళ్ళానంటే నాలుగు యిచ్చి వస్తాను."

"అంటే?"

"అంటే మరేం లేదమ్మా! మా వోళ్ళకి ఏముందని పెడతారు చెప్పండి. మా యయ్య వుట్టి కల్లు ముచ్చు. మా యమ్మ కూలిపని చేసి నాలుగు డబ్బులు తెస్తే వాన్ని చావ తన్ని అవి లాక్కుంటాడు. మా యయ్యకయితే నన్ను చూస్తే యిడే. మరి డబ్బో."

"............"

"రెండుమార్లు రెండు కోకలు కొని మా యమ్మకు పంపాను. మా ముసిలోడుకి చలి కాలం కదా అని మొన్ననే చొక్కా గుడ్డ కొనిపంపాను. అంతకన్నా ఏం చెయ్యమంటారు చెప్పండి. అందరూ పుట్టింటి కాడనుండి తెచ్చుకుంటే, నేను అల్లకే యెట్టవలసొస్తోంది. అక్కడికీ ఎన్నాళ్ళని చూడకుండా వుండడం అని, యెళ్తాననుకోండి. బోలెడయి పోతుందమ్మా నాకు. డబ్బంతా ఏంజేస్తున్నావని కొడ్తాడు యీడు. ఏటో"

అని లేవబోయింది. సీత వేసిన ప్రశ్న మళ్ళా ఆపుచేసింది.

"నేనన్నది అదికాదే. రేపు పండుక్కి వెళుతున్నావా అని"

"మళ్ళా మొదటికే వస్తారేవమ్మా. అల్ల మొకాలు మండ. మరి నన్ను తీసికెళ్ళరు. అవన్నీ ఎందుకమ్మా.రద్దురూ. నంచుక పెట్టండి. పోతాను."

లోపలికెళ్ళి ఆకులో వూరగాయపెట్టి పట్టుకొచ్చింది. ఎంతో అభిమానంతో వెంకిచేతిలో పెట్టింది.

* * *

రాత్రి యెనిమిదయినా రామం యింటికి రాలేదు. చిట్టిబాబును పక్కన వేసుకొని సీత కలలు కంటోంది. పండుగనాడు పుట్టింట జరుగబోయే వింతలన్నీ కళ్ళముందు కదలుతున్నాయి.

తలుపుతోసుకొని లోనికి వచ్చాడు రామం. సీత లేవలేదు. ఈ ప్రపంచంలో వుంటేగా, చేతిలోని కాయితపు పొట్లాన్ని టేబిలుమీద పెట్టి కోటు విప్పాడు.

"సీతా!... .."

"........."

"రాణీ!......ఓ రాణీ!"

"ఉస్, కేకలు పెట్టకండి. చిట్టిబాబు లేచి పోతాడు" దగ్గరగావచ్చి మంచం మీద కూర్చున్నాడు. సీత లేవలేదు.

"బాబు ఏడవకుండా అన్నం తిన్నాడా?"

"........."

"ఇవాళ తల దువ్వుకోలేదేం"

"ఏమండీ! మరో రెండురోజులు సెలవు పెట్టారా?" భర్త అడిగిన ప్రశ్నలు వినిపించాయో లేదో? తనలోకమే తనది, సీత అడిగినది దేనిగురించో కూడా రామానికి తెలియలేదు.

"ఎందుకేమిటండీ. వెళ్ళక వెళ్ళక వెళ్తున్నామా, మరి రెండు రోజులయినా అక్కడ వుండకుండా నేను రాలేను బాబూ! అసలు మా అమ్మ మాత్రం వూరుకుంటుందనుకున్నారా."

రామం ఫక్కున నవ్వాడు. ఆమె ఒళ్ళు

భగ్గున మండింది. "నిజంగా నువ్వు పిచ్చిదానివి సీతా! రెండేళ్లయి తీసికెళ్లని మీనాన్న యిప్పుడు తీసి కెళ్తాడనేనా భ్రమకాని."

అంటూనే లేచిపోయాడు బట్టలు తీసివేయడానికి.

"అంటే నామాట నమ్మరా?"

"నమ్మడానికేముంది, నాకుమాత్రం నమ్మకం లేదు."

"మీ మాటలు చూస్తే నాకు వొళ్లుమండుతుంది సుమండీ. మా తమ్ముడొచ్చి మొన్న చెప్పినదేమిటో. "మీరు యిద్దరూ తప్పక రావాలి. పండుగముందు నేనుగాని, నాన్నగాని వస్తాం. సిద్ధంగా వుండండి," అని చెప్పలేదూ? అప్పుడే మరుపా? లేకవాడి మాటలన్నీ పొల్లే అంటారా?"

"ఏమో నీ యిష్టం. రమ్మంటే వస్తాను. లేకపోతే వూరుకుంటాను"

భార్యతో రభస తెచ్చుకోవడం రామానికేమాత్రం యిష్టంలేదు. ఊరుకున్నాడు.

అంతవరకూ మంచం మీదనుండి లేవనిది, చప్పున లేచి టేబిలుమీద పెట్టిన కాయితపు పొట్లాన్ని విప్పింది. ఎందుచేతనో వెంటనే రుద్రరూపం దాల్చింది. పొట్లాన్ని నులిమి గది మధ్యకు విసరివేసింది.

కాళ్లు కడుక్కోడానికి పెరటిలోకి వెళుతున్న రామం చప్పున ఆగిపోయాడు.

"మంచి గుడ్డలు కావాలోయని ఎంత ఏడుస్తానో, అంతలాటి ఎబ్బురుంటిగుడ్డలు తెచ్చి నా మొహాన పారేస్తారు"

"ఇప్పుడే మొచ్చింది?"

"ఎందుకా ముష్టిగుడ్డలు, కట్టుకోడానికేనా?"

"ఏం తక్కువొచ్చాయి ఆ గుడ్డలకి"

"ఏమిటి తక్కువొస్తాయి. కళ కాంతులు ......"

ఇన్నాళ్లనుండి కాపురం చేస్తున్నాడుగాని భార్య అభిరుచులను గ్రహించలేకపోయాడు.

"ఈ జన్మానికి నేను ఎలాగా నోచుకోలేదు, సుఖపడ్డానికి గాని, ముద్దూ, ముచ్చటా తీరడానికి గాని. చిట్టిబాబుకేనా అవిసవ్యంగా సాగుతాయా అన్న బాధతప్ప."

"........."

"వీరమంచిది కొనకపోతే పోయారు. వాడికో సిల్కు జుబ్బాకొంటే ఏంతరిగి పోయిందని? వాడికీ ఓ ముష్టిగుడ్డ తెచ్చిపడేశారుగాని."

"............"

"పోనీలెండి వాడే అదృష్టవంతుడయితే మీ మీద ఆధారపడ నక్కరలేదు. వాళ్ళ తాతయ్యే యిస్తాడు బోలెడంత."

"చెప్పేదేమిటి తాతయ్య కరుణ. ఒకమారొచ్చి చూడ్డానికి యిది లేక పోయిందిగాని కబుర్లు చెప్పావ."

ఇంతవరకూ దిగ మ్రింగుతున్న దుఃఖం పొరలి పొరలి వచ్చింది. ఎవరినైతే నిర్లక్ష్యంగా చూడాలనుకుంటున్నదో వారిముందు కంటతడి పెట్టడం కష్టమనిపించింది

"కట్నాలుగాని, కానుకలుగాని పుచ్చుకున్నన్నాళ్లూ బాధలేదు. ఎప్పుడైనా కొంచెం లోటు కనపిస్తే చాలు నలుగురి నోట్లోనూ పడతారు"

లేచిపోయినదల్లా మళ్ళా పిల్లడి పక్కలో ఒరిగిపోయింది.

"చేతలు కనుపించలేదుగాని, మాటలే వినిపిస్తున్నాయి"

"కొన్నాళ్లుపోతే అవీ వినిపించవు. పోనీలెండి. మీరేం నాకు పెట్ట నక్కరలేదు. నా పుట్టింటివాళ్ళకింత అన్నానికి లోటు లేనంత కాలం, నాకూ నాచిట్టిబాబుకూ ఏ లోటూ లేకుండా చూడగలరు. మీరు గనక ఒక మంచి గుడ్డముక్క కొనడానికి డబ్బుముఖం చూసుకున్నారుగాని వాళ్లలాగాదు."

భార్య తన్నెంత నీరసంగా చూడదలచుకున్నా తన్నెంత దుయ్యబట్ట దలచుకున్నా, అతను కోపగించుకునే మనిషి కాడు. కలహాన్ని పెంచేవాడూ కాదు.

"అయితే మీతోపాటు నాకుకూడా ఏ లోటురాకుండా చూసిపెట్టమందు. నీ పేరు చెప్పుకుంటాను."

అన్నాడు సమాధానపరిచే వుద్దేశంతో.

"అదీ నిజమే. లేకపోతే వాళ్ళకిదెప్పిపొడుపుమాట లెక్కడనుంచి వస్తాయి."

సీత కోపం చల్లారలేదు.

"మీరు వచ్చినా లేకపోయినా, చిట్టిబాబును తీసికొని నేను మాత్రం పోతాను. మిమ్మల్ని పెళ్లాడినందుకు నేనేం సుఖపడి చావలేదు. ఏదో మీ ధర్మమా అంటూ ఇంత తిండి పారేస్తున్నారు. ఆమాత్రం ఎవరైనా పెట్టగలరు."

రామం కుర్చీలోనే కూర్చుని వున్నాడు. ఆమె పిల్లడి పక్కలో యెంతకాలం వుండిపోయిందో ఆమెకే తెలియదు.

* * *

రోజులు దొర్లిపోతున్నాయి.

ఉత్తరమూ రాలేదు. మనిషీ రాలేదు. సీత మాత్రం ఎదురు తెన్నులు చూస్తూ కూర్చున్నది భర్త యిక యీ వూసే ఎత్తలేదు.

చివరకు భోగి పండుగ నాడైనా వచ్చి తీసికెళ్తారేమో అనుకున్నది. తెల్లవారుజామున నే లేచి, చిట్టిబాబుకు తలంటి నీళ్ళు పోసింది. తనూ పోసుకుంది. రామం పోసుకోలేదు. ఆమె ఆశే పట్టించుకోలేదు. తెల్లవారేసరికి తమ్ముడు గాని, నాన్నగాని వస్తారు వెళ్ళిపోవచ్చు. ఇంక ఆయన ప్రాధేయతేమిటి. బావుండదు కదా అని ఒకమారు "మీరు నీళ్లు పోసుకుంటారా" అంది తల తిప్పేసుకున్నాడు.

భోగినాడు పండుగ చెయ్యలేదు.

పండుగ పూట చారు అన్నం పెట్టింది భర్తకు. అతనూ నోరు మెదపలేదు.

మధ్యాహ్నం పెరటిగుమ్మంలో పిల్లడిని వొళ్ళో వేసుకొని ఏదో ధ్యానంలో పడ్డది.

"దండాలండి అమ్మగోరూ!"

వెంకి మాట వినిపించగానే అటు తిరిగి చూసింది. వెంకి బాగా ముస్తాబయింది. కొత్తది ఎర్రచీర కట్టుకుంది. చెవులకు, ముక్కుకి కొత్తసరుకులు తగిలించింది. ముఖం నిండా పసుపు రాసుకొని రూపాయంత బొట్టు పెట్టుకుంది. ఆమె వెనకాలే నడుము వంగిన మూడుకాళ్ళ ముసలి ఒకడు నిలుచున్నాడు. వెంకి నోటినుండి నవరత్నాలు రాలుతున్నాయి

సీతకిదేమీ అర్థంకాలేదు.

"ఈడేనమ్మా మా ముసిలోడు. ఇన్నాళ్లకి నామీద కనికారం పుట్టి ఒచ్చినాడు. అమ్మగోరికి దణ్ణమెట్టరా అయ్యా, పండుగ బరాతం పడేస్తారు."

ముసిలాడు వణుకుతున్న రెండు చేతులు జోడించాడు.

"అమ్మగోరండి, మీరు పుట్టింటికెళ్తున్నారు గదా అని రేతిరల్లా నాకు కునుకే రాలేదండి. పయానమయి పోవామా అనిపించింది. తెల్లారి చూద్దునా, మా ముసిలోడే ఒచ్చినాడమ్మా. మాపిటికి యెళ్ళిపోతాం."

అని వెంకి పట్టలేనంత సంతోషంతో చెబుతోంది. తాను చెబుతున్నది సీతమ్మ వింటోందా లేదా అని కూడా చూడలేదు.

సీతనోటినుండి మాటరాలేదు. గిర్రున తిరిగి లోనికి వెళ్ళిపోయింది. వెంకి విస్తుపోయింది.

* * *

రాత్రి ఎనిమిది గంటలు దాటిపోతోంది. చిట్టిబాబు నిద్రపోయాడు. వాణ్ణి మంచంమీద వేసి, క్రింద చాప పరుచుకొని పడుకున్నది.

రామం వచ్చి లేపాడు. లేవలేదు.

"సీతా!"

"… … …"

"ఓ సీతాదేవీ!"

పలుకలేదు. ఇంతకీ ఆమె నిద్రపోతేగా.

బలవంతాన రెక్క పట్టుకొని కూర్చోబెట్టాడు. ఆమె కనుకొనలనుండి కన్నీరు జోట జోట కారుతోంది.

"ఏడుస్తున్నావా? ఛీ! పిచ్చిపిల్లా.ఎవరైనా అలా ఏడుస్తారా?"

"… … … …"

"ఏదీ యిటు చూడు, ఒక్కమారు నవ్వు. ఏదీ?" కారుతున్న కన్నీటిని చేతితో తుడిచాడు.

"ఇదిగో! చిట్టిబాబుకు సిల్కుజుబ్బా. నీకు సిల్కుచీర."

"… … … …"

"ఈ చీర ఖరీదెంతో తెలుసా. తొంభై రూపాయలు."

సీత మాటాడలేదు. వాటిని చూడనూ లేదు. చెంపలమీదికి కన్నీరు కారుతూనే వుంది.

పిచ్చిస్త్రీని అనురాగంతో దగ్గరగా తీసుకున్నాడు రామం.